ఈనాడు
కుమురం భీం
బుధవారం అక్టోబరు 2, 2024

మహాత్ముని మాట.. వెలుగు బాట

● నేడు గాంధీ జయంతి


“ సముద్రంలో చారెడు నీళ్లు కలుషితమైతే సముద్రమంతా కలుషితమైనట్టు కాదు. ఏదో ఒక చేదు అనుభవం ఎదురైనంత మాత్రాన మానవత్వం మంట గలిసినట్టు కాదు.

లక్సెట్టిపేట, దండేపల్లి న్యూస్‌టుడే

నూలు వడుకుతూ, మురికి వాడలు శుభ్రం చేస్తూ సామాన్యుల్లో సామాన్యుడిగా కలిసిపోయి భారత స్వాతంత్ర్య పోరాటాన్ని నిర్మించిన అనితర సాధ్యుడు ఆయన. బ్రిటిషర్లతోనే కాదు, దేశంలోని సామాజిక రుగ్మతలపై సమకాలీన పోరాటాలు చేశారు గాంధీ. అలాంటి మహాత్ముడి అడుగుజాడలే మనకు దారి దీపాలు, బాపు మాటలే బంగారు బాటలు. గాంధీ జయంతిని పురస్కరించుకుని ఆయన ఆశయాలను పునికిపుచ్చుకుని ఆదర్శంగా నిలుస్తున్న గ్రామ సీమలపై ‘న్యూస్‌టుడే’ కథనం

మద్యపాన నిషేధం

స్వరాజ్య సాధనకు గాంధీజీ అహింసను ఆదర్శవంతమైన మార్గంగా ఎంచుకున్నారు. మద్యపానం అనేది ఉన్నత ఆశయ సాధనకు అడ్డంకి అని గ్రహించిన ఆయన మద్యపానానికి వ్యతిరేకంగా ప్రచారం చేశారు. మద్యం మత్తు సమాజాన్ని హింసా మార్గం వైపు నడిపిస్తుంది అని బలంగా నమ్మారాయన. కొన్ని గ్రామాలు స్వచ్ఛందంగా మద్య నిషేధం విధించుకుని ఆదర్శంగా నిలుస్తున్నాయి.



లింగదరి గూడెం గ్రామం

వీరు సాధించారు

నెన్నెల, బెల్లంపల్లి గ్రామీణం: బెల్లంపల్లి మండలం లింగదరిగూడెం గ్రామస్థులు గాంధీజీ ఆశయ సాధనలో మద్యం, మాంసాలకు దూరంగా ఉంటూ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఇక్కడ నివాసముండేది లింగదరి కోయలు. 60 కుటుంబాలు నివాసముంటున్నాయి. వీరు 60 సంవత్సరాలుగా మద్య, మాంసాలు ముట్టడం లేదు. ఊళ్లో పెంపుడు జంతువులను కూడా పెంచరు. ఎవరైనా చనిపోతే ఇంటి ఆవరణలోనే సమాధి చేయడం ఆనవాయితీ.

“ విద్య సమాజాన్ని జాతి, మత, కుల, వర్ణ వివక్షతలకు అతీతంగా దగ్గర చేస్తుంది. కొత్త రంగు, రూపాన్ని ఇచ్చి భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తుంది. ఉమ్మడి జిల్లాలో ఇంకా 7 లక్షల మంది వరకు నిరక్షరాస్యులు ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఇందులో వయోజనులే అధికంగా ఉన్నారు.



చందారంలో వయోజనులకు చదువు నేర్పుతున్న యువతి

చందారంలో అక్షర కాంతులు

లక్సెట్టిపేట మండలం చందారంలో నిరక్షరాస్యులైన వయోజనులకు వయోజన విద్యాశాఖ అధికారుల ఆధ్వర్యంలో వంద రోజుల పాటు కార్యక్రమం నిర్వహించారు. ఇందులో నిరక్షరాస్యులు అక్షరాస్యులుగా మారారు. శిక్షణ ఇచ్చిన యువతులు ఉచితంగా పొందిన కుట్టు శిక్షణ ద్వారా తమకు ఉపాధి మార్గాన్ని వెతుక్కోగలగడం విశేషం. విద్యావంతులైన గ్రామంలోని యువత సహకారంతో 65 మందికి అక్షర జ్ఞానం కల్పించారు.

జిల్లాలవారీగా అక్షరాస్యత శాతం ఇలా...

జిల్లా	శాతం
కుమురంభీం	59.72
ఆదిలాబాద్	65.46
మంచిర్యాల	66.37
నిర్మల్	69.09

“ ప్రపంచంలో నీవు చూడాలనుకునే మార్పు మొదట నీ నుంచే ప్రారంభం కావాలి.

“ శ్రమ నీ ఆయుధం అయితే గెలుపు నీకు బానిస అవుతుంది

“ క్విట్ ఇండియా ఉద్యమంతో బాపూజీ దేశాన్ని బానిస సంకెళ్ల నుంచి విముక్తి కల్పించారు. క్లీన్ ఇండియా నినాదంతో దేశం మెరుగైన స్థితిలో నిలుస్తుందని ఆయన ఆనాడే భావించారు.

పారిశుద్ధ్యం

బాపూజీ కలల సాకారానికి అనుగుణంగా గ్రామస్వరాజ్య స్థాపన కోసం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వం ప్రతి గ్రామంలో చెత్త డంపింగ్ యార్డులు, శ్మశాన వాటికలు, తడిపొడి చెత్త వేరు చేసేందుకు వ్యవస్థలను ఏర్పాటు చేశారు. ప్రతి ఇంటికీ మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టారు. పచ్చదనం కోసం మొక్కల పెంపకం చేపట్టారు. గ్రామాల్లో పారిశుద్ధ్య సమస్య పరిష్కారానికి బాటలు వేశారు.



దేవుని గూడెం గ్రామం



దేవుని గూడెంలో ఏర్పాటు చేసిన స్టీలు ప్లేట్లు, గ్లాసులు, డబ్బాలు

ప్రగతి పల్లె దేవుని గూడెం

జన్నారం మండలం దేవునిగూడ గ్రామం ఓడీఎఫ్ ప్లస్‌గా గుర్తింపు పొందింది. స్వచ్ఛతలో 98 శాతం, గుడ్ గవర్నెన్స్‌లో వంద శాతం మార్కులు సాధించింది. ప్రతి నెల క్రమం తప్పకుండా గ్రామసభలు నిర్వహించడం, జీపీ నిధుల నుంచి 750 బ్యాగులు కొనుగోలు చేసి ఇంటింటికి పంపిణీ చేయడం, స్టీల్ బ్యాంకు ఏర్పాటు ద్వారా గ్రామంలో జరిగే ఫంక్షన్లలో ప్లాస్టిక్ గ్లాసులు, పేపర్ ప్లేట్ల వాడకం లేకుండా నియంత్రించగలిగారు. తడి, పొడి చెత్తలను వేరు చేసి చెత్త ద్వారా సంపద సృష్టి వైపు అడుగులు వేశారు.

“ ఎంత గొప్పగా జీవించావో నీ చేతలు చెప్పాలి... ఎంత గొప్పగా మరణించావో సమాజం చెప్పాలి.

“ చాలా సమస్యలు మౌనంతోనే పరిష్కారం అవుతాయి. కానీ మనం మాటలతో ఆ అవకాశాన్ని చేజార్చుకుంటాం.

అయోమయంలో డీఎస్సీ అభ్యర్థులు.!

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే

ఉపాధ్యాయ కొలువులకు సంబంధించి డీఎస్సీ ఫలితాలు విడుదలవడంతో.. అర్హత సాధించిన అభ్యర్థుల ధ్రువపత్రాలను జిల్లా విద్యాశాఖ అధికారులు పరిశీలిస్తున్నారు. ఈ నెల 1-5 తేదీ వరకు ఈ క్రతువు కొనసాగుతుందని ప్రకటించిన విషయం తెలిసిందే. కుమురంభీం జిల్లా కేంద్రంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ధ్రువపత్రాలను జిల్లా ఎంపిక కమిటీ సభ్యులు పరిశీలిస్తున్నారు. ఒక్కో పోస్టుకు 1:3 చొప్పున అభ్యర్థులను ధ్రువపత్రాల పరిశీలనకు పిలిచారు. అయితే జిల్లాలో కొందరు డీఎస్సీ అభ్యర్థులు ధ్రువ పత్రాల విషయంలో అయోమయానికి గురవుతున్నారు.

బీసీ-డీ పరిధిలోకి వచ్చే కొందరు అభ్యర్థులు ఈడబ్ల్యూఎస్ ధ్రువ పత్రంతో డీఎస్సీ ఫలితాల్లో ముందు ర్యాంకులో నిలిచారు. అదే ధ్రువపత్రాలు పొందిన కొందరు ఓసీ అభ్యర్థులు వారి తరువాత స్థానాల్లో నిలిచారు. మార్కులపరంగా ర్యాంకులు వస్తాయి. వాటి పరంగా స్థానాలు ఉంటాయి.

కానీ ఇక్కడ పరిస్థితి కాస్త భిన్నంగా కనిపిస్తోంది. వాస్తవానికి సదరు బీసీ-డీ పరిధిలోకి వచ్చే వారు కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఓబీసీలో లేదు. వారు ఈడబ్ల్యూఎస్ ధ్రువ పత్రం పొందినా.. ఆ కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు, విద్యకు మాత్రమే వర్తిస్తుందని, దానిని రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో వినియోగించుకోవడంతో.. ఈడబ్ల్యూఎస్ ధ్రువ పత్రాలు పొందిన తాము నష్టపోవాల్సి వస్తుందని కొందరు ఓసీ అభ్యర్థులు వాపోతున్నారు. దీనిపై కొందరు విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా.. వారికి సరైన అవగాహన లేక ఆందోళన చెందుతున్నారు.

ఇదేలా సాధ్యం..?

ఈడబ్ల్యూఎస్ ధ్రువపత్రంలో సదరు కులాన్ని సైతం నమోదు చేస్తారు. బీసీ-డీకి చెందిన వారు ఈడబ్ల్యూఎస్‌లో ఓసీగా నమోదు చేశారు. దీంతో ఒకే వ్యక్తి ఇలా వేర్వేరుగా ఓసీ, బీసీ-డీగా ధ్రువపత్రాల్లో నమోదు చేయడం చర్చనీయాంశంగా మారింది. ఇలా డీఎస్సీకి ఎంపికైన వారు జిల్లాలో సుమారు పదుల సంఖ్యలో ఉన్నట్లు ప్రచారం సాగుతోంది. వీరి విషయంలో అధికారులు ఏ ధ్రువపత్రాన్ని ప్రామాణికంగా తీసుకుని ఉద్యోగానికి ఎంపిక చేస్తారన్నది ఆసక్తిగా మారింది. దీనిపై మంగళవారం కలెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు పలువురు ఓసీ అభ్యర్థులు పేర్కొన్నారు. ఉద్యోగాల ఎంపిక విషయంలో జిల్లా ఎంపిక కమిటీ సభ్యులు అన్ని విధాలా ధ్రువపత్రాలు పరిశీలించి అర్హులకు నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఇదే కాకుండా అంతర్జాలంలో దరఖాస్తు చేసుకున్న సమయంలోని సమాచారాన్ని పరిగణనలోకి తీసుకుని ధ్రువ పత్రాలు పరిశీలించాలన్నారు. అలా కాకుండా అప్పుడు తెలియక తప్పుగా నమోదు చేశామని, ఇప్పుడు వేరే ధ్రువ పత్రాలు సమర్పిస్తే అనుమతించరాదని జాబితాలోని కొందరు అభ్యర్థులు కోరుతున్నారు. కొందరు ఇతర జిల్లాల వారి పేర్లు సైతం జాబితాలో వచ్చాయని, అలాంటి వారి విషయంలో స్థానికత పక్కాగా పరిశీలించాకే ఎంపిక చేయాలని కోరుతున్నారు.

డిజిటల్ కార్డుల సర్వేకు ఏర్పాట్లు

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే : జిల్లాలో తెలంగాణ డిజిటల్ ఫ్యామిలీ కార్డుల సర్వేకు ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ వెంకటేష్ దోత్రే పేర్కొన్నారు. మంగళవారం రాష్ట్ర రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ఇతర ఉన్నతాధికారులతో కలసి హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, సబ్ కలెక్టర్లు, ఆర్డీవోలు, ఇతర శాఖల అధికారులతో కలసి వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. అదనపు కలెక్టర్లు దీపక్ తివారీ, దాసరి వేణు, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్ల, ఆర్డీవో లోకేశ్వర్‌రావులతో కలిసి కలెక్టర్ పాల్గొని మాట్లాడారు.

ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం నియోజకవర్గానికి రెండు గ్రామాల చొప్పున డిజిటల్ కార్డుల సర్వేకు ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. పైలట్ ప్రాజెక్టు కింద రెండు గ్రామాలను ఎంపిక చేసి సర్వే చేపడతామన్నారు. ఎల్ఆర్ఎస్ పథకం కింద జిల్లాలో 7,698 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. వీటి పరిశీలనకు రెవెన్యూ, పంచాయతీ రాజ్, పురపాలిక, ఇరిగేషన్ అధికారులతో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు కోసం ప్రణాళిక సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు. సన్న, దొడ్డు రకాలు వేర్వేరుగా కొనుగోలు చేసేలా కేంద్రాలు ఏర్పాటు చేస్తామన్నారు. పుర కమిషనర్లు భుజంగ్‌రావు, అంజయ్య, డీఎల్‌పీవో ఉమర్ హుస్సేన్, జిల్లా పౌరసరఫరాల అధికారి వినోద్‌కుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే, చిత్రంలో అదనపు కలెక్టర్లు దీపక్ తివారీ, దాసరి వేణు, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్ల, ఆర్డీవో లోకేశ్వర్‌రావు



వర్షాలకు పగుళ్లు తేలి

ప్రమాదకరంగా.. రోడ్‌డ్యాం

మండలంలోని దుగ్గపూర్-బోరింగ్‌గూడ మధ్య రోడ్‌డ్యాం (లోలెవల్ వంతెన) ప్రమాదకరంగా మారింది. గతేడాది కురిసిన భారీ వర్షాలకు సిమెంటు పూతలు పగిలి నెర్రలు తేలాయి. వాహనదారులు దీనిపై దాటేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ మార్గం గుండానే గోయెగాం, బోరింగుగూడ, కోయతెలండి గ్రామాల ప్రజలు నిత్యం వివిధ పనుల నిమిత్తం మండల కేంద్రానికి రాకపోకలు సాగిస్తుంటారు. ఏ కొద్దిపాటి వర్షం పడినా రోడ్‌డ్యాంపై నుంచి వరద నీరు ప్రవహించి రాకపోకలు నిలుస్తాయి. మరమ్మతులు చేయించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై ఎంపీడీవో మల్లేష్ వివరణ కోరగా.. నిధులు రాగానే మరమ్మతులు చేయిస్తామని చెప్పారు. **- తిర్యాణి, న్యూస్‌టుడే**

ఓపెన్ డిగ్రీలో ప్రవేశాలకు గడువు పెంపు

కాగజ్‌నగర్, న్యూస్‌టుడే : పట్టణంలోని ఎస్‌కేఈ డిగ్రీ కళాశాలలో డా.బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ అధ్యయన కేంద్రంలో డిగ్రీలో ప్రవేశాలకు ఈ నెల 15వ తేదీ వరకు గడువు పెంచినట్లు కో-ఆర్డినేటర్ తూడూరు దత్తాత్రేయ మంగళవారం తెలిపారు. ఇంటర్ తత్సమాన అర్హతగల అభ్యర్థులు 2024-25 విద్యాసంవత్సరానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, ఆసక్తిగల అభ్యర్థులు పూర్తి వివరాలకు చరవాణి నం. 73829 29651లో సంప్రదించవచ్చని సూచించారు.

ఎల్ఆర్ఎస్ సర్వేపై సమీక్ష

కాగజ్‌నగర్, న్యూస్‌టుడే : అనుమతి లేని లేఅవుట్లు, భూముల క్రమబద్ధీకరణకు చేపడుతున్న ఎల్ఆర్ఎస్ సర్వేను సమర్థంగా నిర్వహించాలని జిల్లా అదనపు పాలనాధికారి దీపక్ తివారీ అధికారులకు సూచించారు. కాగజ్‌నగర్ ఎంపీడీఓ కార్యాలయంలో సబ్‌కలెక్టర్ శ్రద్ధా శుక్లతో కలిసి వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎల్ఆర్ఎస్ సర్వేను అన్ని శాఖల అధికారులు సమన్వయంతో చేపట్టాలన్నారు. క్షేత్రస్థాయిలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి శిక్షణ ఇవ్వాలని చెప్పారు. డివిజన్‌లోని ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

అట్టహాసంగా జోనల్ స్థాయి క్రీడోత్సవాలు

ఆసిఫాబాద్ అర్బన్, న్యూస్‌టుడే : జిల్లా కేంద్రంలోని గిరిజన బాలికల ఆదర్శ క్రీడా పాఠశాల మైదానంలో మంగళవారం గిరిజన సంక్షేమశాఖ పరిధిలోని మంచిర్యాల, కుమురం భీం జిల్లాల జోనల్ స్థాయి విద్యార్థుల క్రీడా పోటీలను అట్టహాసంగా నిర్వహించారు. ఆసిఫాబాద్, జైనూరు, కాగజ్‌నగర్, మంచిర్యాల డివిజన్ల నుంచి సుమారు 900ల మంది క్రీడాకారులు వివిధ విభాగాల్లో పాల్గొన్నారు. ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి మాట్లాడుతూ.. జిల్లా క్రీడాకారులు ప్రతిభ చాటి జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. గిరిజన సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ రమాదేవి మాట్లాడుతూ.. పోటీల్లో ఎంపికైన క్రీడాకారులు నవంబరులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. విజేతలకు బహుమతులు అందజేశారు. మాజీ ఎంపీపీ అరిగెల మల్లికార్జున్, గిరిజన క్రీడల అభివృద్ధి అధికారి బండ మీనారెడ్డి, ఏసీఎంవో పి. ఉద్ధవ్, జీసీడీవో డి.శకుంతల, ఏటీడీవోలు చిరంజీవి, కమర్ హుస్సేన్, శ్రీనివాస్, మంచిర్యాల జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి బండ జీవరత్నం, ప్రధానోపాధ్యాయులు జంగు, సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు, కోచ్‌లు విద్యాసాగర్, అరవింద్ పాల్గొన్నారు.



విజేతలతో ఎమ్మెల్యే కోవ లక్ష్మి, మాజీ ఎంపీపీ అరిగెల మల్లికార్జున్, డీటీడీవో ఆర్.రమాదేవి

అర్ధాంతరంగా నిలిచి.. అవస్థలు తెచ్చిపెట్టి!

మండలంలోని తెలండి గ్రామ పంచాయతీ అమీన్‌గూడ వంతెన నిర్మాణ పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. మూడేళ్ల కిందట డిస్ట్రిక్ మినరల్ ఫండ్ (డీఎంఎఫ్‌టీ) రూ.1.50 కోట్ల అంచనాతో గుత్తేదారు పనులు ప్రారంభించి పిల్లర్ల వరకు నిర్మించి వదిలేశారు. ఇది పూర్తయితే అమీన్‌గూడ, కోయ తలండి గ్రామాలకు నేరుగా.. గోయెగాం, సోనపూర్ కొంత సౌకర్యంగా ఉంటుంది. నిత్యం ఆయా గ్రామాల ప్రజలు నిత్యావసర సరకులకు పెర్కపల్లి, తెలండి గ్రామాలకు, మండల కేంద్రానికి రాకపోకలు సాగిస్తుంటారు. వానకాలంలో నిండుగా ప్రవహించే వాగును దాటి రావాలంటే ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు స్పందించి వంతెన పూర్తి చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

- తిర్యాణి, న్యూస్‌టుడే



బంధువులతో వాగు దాటుతున్న విద్యార్థులు

వృద్ధులు భావితరాలకు మార్గదర్శకులు

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే : వృద్ధులు భావితరాలకు మార్గదర్శకులని కలెక్టర్ వెంకటేష్ దోత్రే పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో అంతర్జాతీయ వయో వృద్ధుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అదనపు కలెక్టర్ దాసరి వేణు, వయోవృద్ధుల సంక్షేమ సంఘం ప్రతినిధులతో కలసి హాజరై మాట్లాడారు. వృద్ధుల పట్ల గౌరవ భావం కలిగి ఉండాలన్నారు. వారి పోషణ, సంరక్షణ అందరి బాధ్యత అని పేర్కొన్నారు. ప్రభుత్వం వారి సంక్షేమం కోసం పటిష్ఠమైన చట్టాలు తీసుకొచ్చినట్లు గుర్తుచేశారు. చట్టాలపై అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. వృద్ధులు తమ సమస్యలపై నేరుగా తనను కలవచ్చని సూచించారు. కాగజ్‌నగర్‌లో వృద్ధాశ్రమం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం పలువురిని సత్కరించారు. వారి సంక్షేమం కోసం పాటుపడేలా ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి భాస్కర్, డీఆర్‌డీవో దత్తారావు, వయోవృద్ధుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు బుచ్చమ్మ, కార్యదర్శి లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



వృద్ధురాలిని సన్మానిస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే, జిల్లా సంక్షేమ అధికారి భాస్కర్, తదితరులు



ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, వృద్ధులు, తదితరులు

పకడ్బందీగా ధ్రువపత్రాల పరిశీలన

ఆసిఫాబాద్ అర్బన్, న్యూస్‌టుడే : ఉపాధ్యాయుల నియామకం కోసం ఎంపికైన అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలనను ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పకడ్బందీగా నిర్వహించాలని డీఈఓ ఎస్. యాదయ్య అన్నారు. జిల్లా కేంద్రంలో జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం డీఎస్సీ మెరిట్ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన కోసం నియమించిన బృందాల వారితో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. పరిశీలన బృందాల్లో అనుభవజ్ఞులైన ఎంఈవోలు, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్లను నియమించామన్నారు. 1:3 నిష్పత్తిలో అభ్యర్థులను పరిశీలనకు పిలువనున్నట్లు చెప్పారు. అభ్యర్థులు చెక్ లిస్ట్, రెండు సెట్ల అటెస్టెడ్, ఒరిజినల్ ధ్రువపత్రాలతో హాజరు కావాలని సూచించారు. పాఠశాల విద్యాశాఖ ద్వారా వచ్చిన సందేశాల ప్రింటెడ్ కాపీని కూడా అభ్యర్థులు తీసుకొని రావాల్సి ఉంటుందని తెలిపారు. స్థానికత తదితర ధ్రువపత్రాల పరిశీలనను జాగ్రత్తగా చేయాలన్నారు. ఒక పోస్టు కంటే ఎక్కువ వాటికి ఎంపికైన అభ్యర్థులు వద్దనుకున్న పోస్టులకు సంబంధించిన డిక్లరేషన్ ఇవ్వాల్సి ఉంటుందని తెలిపారు. పరిశీలన సమయంలో సందేహాలుంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. సమావేశంలో ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ ఎం. ఉదయ్‌బాబు, డీఈవో కార్యాలయ అసిస్టెంట్ డైరెక్టర్ గమాన్యల్, కమ్యూనిటీ మొబలైజింగ్ కో-ఆర్డినేటర్ కటుకం మధుకర్, ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఈవో ఎస్.యాదయ్య, పాల్గొన్న ఏసీజీఈ ఉదయ్‌బాబు, ఏడీఏ గమాన్యల్

‘తడోబా’ సందర్శన ప్రారంభం

బల్లార్ష, న్యూస్‌టుడే: మూడు నెలలుగా మూసివేసిన మహారాష్ట్రలోని తడోబా అభయారణ్యాలను మంగళవారం నుంచి పర్యాటకుల సందర్శనకు అనుమతించారు. ఏటా వానకాలంలో (జులై, ఆగస్టు, సెప్టెంబరు) పర్యాటకుల అనుమతిని నిరాకరిస్తారు. అభయారణ్యాలలోని కోర్ జోన్‌లోకి మోహర్లీ, కొలారా, నవేగావ్, కుట్వాడా, ఝరి, పంగడి గేట్ల వద్ద పర్యాటకుల కోసం 60 జిప్సీలను ఏర్పాటు చేశారు. వేతనాలు పెంచాలని గైడ్లు, జిప్సీల డ్రైవర్లు ఆందోళన చేపట్టడంతో సందర్శన జరగలేదు.

అందని హక్కులు.. దక్కని పథకాలు!

● ‘విరాసత్’ కోసం గిరిజన రైతుల ఎదురుచూపులు

ఈనాడు, ఆసిఫాబాద్, న్యూస్‌టుడే, ఇంద్రవెల్లి

పోడు భూములను సాగు చేసుకుని జీవనం సాగించే గిరిజనులు వివిధ కారణాలతో చనిపోతే వారి వారసులకు హక్కులు రావడం లేదు. దీంతో రైతు భరోసా, బీమా, రుణమాఫీ తదితర పథకాలకు దూరమవుతున్నారు. విరాసత్ చేయాలని బాధితులు ఐటీడీఏ కార్యాలయం చుట్టూ ఏళ్ల తరబడి ప్రదక్షిణలు చేస్తున్నారు. చనిపోయిన వారి పేర్లతోనే పట్టా భూములు (ఆర్వోఎఫ్ఆర్) ఉండటం వల్ల పంట రుణాలు ఇవ్వలేమని బ్యాంకర్లు స్పష్టం చేస్తున్నారు. మరోవైపు రెవెన్యూ పట్టాలు కలిగిన గిరిజనుల భూములకు సైతం ఇదే సమస్య ఎదురవుతోంది. ఐటీడీఏ భూముల మ్యూటేషన్‌కు సంబంధించి ప్రత్యేక లాగిన్ ఇప్పటికీ లేకపోవడంతో.. విరాసత్‌లు సాధ్యపడటం లేదు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని డీటీడబ్ల్యూఓ (జిల్లా గిరిజన సంక్షేమాధికారి) కార్యాలయంలో రైతుల దరఖాస్తులు వేల సంఖ్యలో పేరుకుపోయాయి.

ఏజెన్సీ ప్రాంతాల్లోని గిరిజనులు సాగు చేస్తున్న భూములకు సంబంధించి 2006లో అప్పటి ప్రభుత్వం పట్టాలు అందజేసింది. మళ్లీ 2023లో పోడు పట్టాలను సర్కారు జారీ చేసింది. పట్టాదారు మృతి చెందిన అనంతరం వారసులు తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకుంటున్నారు. వీరు క్షేత్రస్థాయిలో పర్యటించి, వారసులేనా అని నిర్ధారించిన తర్వాత నివేదికను డీటీడబ్ల్యూఓ కార్యాలయానికి పంపుతారు. అక్కడి నుంచి ఐటీడీఏకు చేరుకుంటున్నాయి. ఈ దరఖాస్తులను ఐటీడీఏ అధికారులు వారి వద్ద ఉన్న వివరాలతో సరిచూసి, వారసుల పేర్ల మీద కొత్త పట్టా జారీ చేస్తారు. ఇదంతా మాన్యువల్‌గా (రాత పూర్వకంగా)నే జరుగుతోంది. ఈ దశల్లో లబ్ధిదారుల దరఖాస్తులు ఎక్కడ నిలిచిపోయాయో తెలియకుండా నెలలు, సంవత్సరాలు సంబంధిత కార్యాలయాల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు.



విరాసత్ కోసం దరఖాస్తులు

జిల్లా	దరఖాస్తులు
కుమురంభీం	5,415
నిర్మల్	2,466
ఆదిలాబాద్	6,324
మంచిర్యాల	3,148


ఉమ్మడి జిల్లాలో..
గిరిజన జనాభా : 4.98 లక్షలు
2023లో పట్టాలు తీసుకున్న రైతులు : 33,885
ఎకరాలు: 1,24,521

ఆన్‌లైన్ చేస్తే ఎంతో మేలు..

ధరణిలో ఏజెన్సీ భూములకు సంబంధించి ప్రత్యేక లాగిన్ రూపొందించాలి. విరాసత్ కోసం దరఖాస్తు చేసుకున్న వివరాలను ఆన్‌లైన్ ద్వారా తహసీల్దార్ లాగిన్ నుంచి, ఆర్డీఓ, ఐటీడీఏ లాగిన్‌కు చేరాలి. ప్రతి పదిహేను రోజులకోసారి పెండింగ్ వాటిపై సంబంధిత అధికారులు దృష్టి సారిస్తే విరాసత్‌ల కోసం సంవత్సరాల తరబడి నిరీక్షించే బాధ గిరిజన రైతులకు తప్పుతుంది.

సంవత్సరం నుంచి తిరుగుతున్నాం

- మేస్రం సూర్యారావు, ఇంద్రవెల్లి



మా తమ్ముడు మేస్రం రాము 2023 జూన్‌లో చనిపోయాడు. అయిదు ఎకరాల ఆర్వోఎఫ్ఆర్ పట్టా ఉంది. కుమారుడు మేస్రం అర్జున్ పేరుతో విరాసత్ చేయాలని అధికారులకు దరఖాస్తు పెట్టుకున్నా ఫలితం లేదు. రెవెన్యూ, ఐటీడీఏ కార్యాలయాల చుట్టూ తిరుగుతూనే ఉన్నాం.

లాగిన్ సమస్య ఉంది

- రమాదేవి, జిల్లా గిరిజన సంక్షేమాధికారి, కుమురంభీం జిల్లా

ఆర్వోఎఫ్ఆర్ పట్టాలకు సంబంధించి విరాసత్‌ల కోసం అనేక మంది రైతులు వస్తున్నారు. ఐటీడీఏ కార్యాలయంలో లాగిన్ సమస్య ఉండడం వల్ల సంబంధీకులకు పట్టాల జారీలో జాప్యం ఏర్పడుతోంది. ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

న్యూస్‌టుడే, కాగజ్‌నగర్ గ్రామీణం:

? మండలంలోని మిత్రకాలనీలో మురుగు కాలువలు లేక రోడ్లపైకి వృథా నీరు ప్రవహిస్తోంది. అపరిశుభ్రత నెలకొంది. -నాగేశ్వర్, స్థానికుడు

✔ మురుగు కాలువల నిర్మాణాలకు ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరైన వెంటనే నిర్మించేలా చర్యలు తీసుకుంటాం. - రమేష్, ఎంపీడీఓ కాగజ్‌నగర్


కూలిన గోడను పరిశీలిస్తున్న అదనపు పాలనాధికారి దీపక్ తివారీ, సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్ల

ప్రహరీ నిర్మాణ పనులు చేయిస్తాం

కాగజ్‌నగర్, న్యూస్‌టుడే : పట్టణంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రహరీ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని జిల్లా అదనపు పాలనాధికారి దీపక్ తివారీ తెలిపారు. పాఠశాల ప్రహరీ ఇటీవల కూలిపోగా మంగళవారం సబ్‌కలెక్టర్ శ్రద్ధా శుక్లతో కలిసి పరిశీలించారు. కూలిన గోడ నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేసేలా సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేస్తామని చెప్పారు. ఎంపీడీఓ రమేష్ వెంట ఉన్నారు.

నిప్పంటుకుని పాక్షికంగా ఇల్లు దగ్ధం

బెజ్జూరు, న్యూస్‌టుడే : మండలంలోని బారేగూడ గ్రామంలో తెలి బాపునకు చెందిన ఇల్లు ప్రమాదవశాత్తు నిప్పంటుకుని పాక్షికంగా దగ్ధమైంది. మంగళవారం పంట పొలానికి పిచికారీ చేసే పంపులో పెట్రోల్ పోస్తున్న క్రమంలో పక్కన ఉన్న పొయ్యిలోని నిప్పు వ్యాపించడంతో మంటలు చెలరేగాయి. ఇరుగుపొరుగు వారు వచ్చి మంటలను ఆర్పేశారు. ఇంట్లోని కుట్టు మిషను, దుస్తులు, టార్పాలిన్లు కాలిపోవడంతో రూ.లక్షలకు పైగా ఆస్తి నష్టం వాటిల్లిందని బాధితుడు తెలిపారు. అక్కడే ఉన్న పొన్న శంకరమ్మ చేతులకు గాయాలు కాగా కాగజ్‌నగర్ ఆసుపత్రికి చికిత్సల నిమిత్తం తరలించారు.


కాలిన వస్తువులు

హత్యాయత్నం కేసులో ముగ్గురికి జైలుశిక్ష

కౌటాల, న్యూస్‌టుడే : ప్రేమ పేరుతో వేధిస్తున్నాడనే నెపంతో వ్యక్తిపై హత్యాయత్నానికి పాల్పడ్డ కేసులో ముగ్గురు వ్యక్తులకు మూడేళ్ల జైలుశిక్ష, ఒక్కొక్కరికి రూ.1000లు జరిమానా విధిస్తూ ఆసిఫాబాద్ జిల్లా అసిస్టెంట్ సెషన్ కోర్టు ప్రధాన న్యాయమూర్తి మంగళవారం తీర్పు వెల్లడించినట్లు కౌటాల సీఐ రమేష్ తెలిపారు. వివరాలు ఇలా.. కౌటాల మండలం గుండాయిపేటకు చెందిన ఎల్ములె సాయిరాం అదే గ్రామానికి చెందిన ఓ అమ్మాయిని ప్రేమ పేరుతో వేధిస్తున్నాడని అదే గ్రామానికి చెందిన నాగపురె శంకర్, నాగపురె పంకజ్, నాగపురె సందీప్‌లు సాయిరాంపై దాడి చేశారు. అనంతరం గ్రామ సమీపంలోని వ్యవసాయ బావిలో పడేశారు. ఈత రావడంతో సాయిరాం ప్రాణాలతో బయటపడి ఇంట్లోవారికి విషయం చెప్పడంతో బాధితుడి తండ్రి ఎల్ములె గణపతి గతేడాది ఆగస్టు 8న ఫిర్యాదు చేశారు. ఈమేరకు కౌటాల ఎస్సై మధుకర్ కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచారు. సాక్షులను విచారించగా నేరం రుజువు కావడంతో సదరు వ్యక్తులపై హత్యాయత్నం కేసు కింద పైమేరకు శిక్ష విధించినట్లు సీఐ వివరించారు.

జూద స్థావరంపై దాడి

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే : మండలంలోని అడ గ్రామ సమీపంలో జూద స్థావరంపై పోలీసులు దాడులు నిర్వహించారు. ముందస్తు సమాచారం మేరకు మంగళవారం సాయంత్రం ఎస్సై రాజేశ్వర్ ఆధ్వర్యంలో పోలీసులు గ్రామంలో తనిఖీ చేయగా.. ఆరుగురు జూదం ఆడుతున్నట్లు గుర్తించారు. వారిని పట్టుకొని రూ.2600 నగదు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

చందా డబ్బుల లెక్క చెప్పాలని యువకుల ఆందోళన

కాగజ్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని అందవెల్లిలో గణేశుని దుర్గామాత ఉత్సవాలకు దాతల నుంచి వసూలైన సొమ్ములో మిగిలిన సొమ్మును ఉత్సవాల నిర్వాహక కమిటీ సభ్యుడు కోట శంకరయ్య తన సొంతానికి వాడుకుని తిరిగి చెల్లించడం లేదని.. యువకులు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. వసూలైన సొమ్ములో ఉత్సవాల అనంతరం రూ.95 వేలు మిగిలాయన్నారు. త్వరలో ఉత్సవాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో పలువురు యువకులు మిగిలిన సొమ్మును ఇవ్వాలని అతన్ని అడిగారు. జాప్యం చేస్తుండడంతో మంగళవారం రోడ్డుపై బైఠాయించారు. ఈ విషయమై ఎస్సై రామన్‌కుమార్‌ను 'న్యూస్‌టుడే' సంప్రదించగా.. కోట శంకరయ్యను పోలీస్ స్టేషన్‌కు రావాల్సిందిగా ఆదేశించినప్పటికీ మంగళవారం రాత్రి వరకు రాలేదని చెప్పారు.

ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే : ఐకేపీ వీవోఏలకు ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్ డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. మూడు నెలలుగా ఇచ్చే గౌరవ వేతనాలు అందక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్లు చెప్పారు. సెర్ప్ నుంచి గుర్తింపు కార్డులు అందించాలని కోరారు. ఐకేపీ వీవోఏల సంఘం మండల అధ్యక్షుడు బుద్దు, సభ్యులు ఓమాజి, ప్రమోద్, సుదర్శన్, రమాదేవి, కళ్యాణి, పద్మ, కవిత, సరిత తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు వేడుకలు అలరించె


కాగజ్‌నగర్ : బతుకమ్మతో జిల్లా మాధ్యమిక విద్యాధికారి కల్యాణి, విద్యార్థులు


చింతలమానెపల్లి : కస్తూర్బా విద్యార్థులు


దహెగాంలో బతుకమ్మతో విద్యార్థులు, అధ్యాపకులు


బెజ్జూరు కస్తూర్బా పాఠశాలలో..

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అయిన బతుకమ్మ వేడుకలను మంగళవారం ముందస్తుగా నిర్వహించారు. బుధవారం నుంచి పాఠశాలలకు దసరా సెలవులు ప్రకటించడంతో.. విద్యార్థినులు, మహిళా ఉపాధ్యాయులు తీరొక్క పూలతో పేర్చిన బతుకమ్మల చుట్టూ తిరుగుతూ ఆడిపాడారు. ఒకరోజు ముందే వేడుకలు నిర్వహించడంతో పాఠశాలలు, కళాశాలల్లో పండగ వాతావరణం నెలకొంది.

– న్యూస్‌టుడే, కాగజ్‌నగర్, ఆసిఫాబాద్ అర్బన్, చింతలమానెపల్లి, దహెగాం, కెరమెరి, బెజ్జూరు, రెబ్బెన, పెంచికల్‌పేట్, వాంకిడి, కాగజ్‌నగర్ గ్రామీణం


పెంచికల్‌పేట్ : బతుకమ్మలు ఎత్తుకున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు


కెరమెరి జడ్పీఎస్ఎస్‌లో..


రాస్పెల్లి పాఠశాల ఆవరణలో..


రెబ్బెన కస్తూర్బా పాఠశాలలో.. ప్రత్యేక అధికారి పద్మ, ఉపాధ్యాయురాలు


వాంకిడి : ఖిరిడి జడ్పీ ఉన్నత పాఠశాలలో..


జిల్లా కేంద్రంలోని జడ్పీ బాలిక ఉన్నత పాఠశాలలో బతుకమ్మలతో ఉపాధ్యాయినులు

సింగరేణి క్రీడాకీర్తి దేశవ్యాప్తం కావాలి

గోలేటి టౌన్‌షిప్, న్యూస్‌టుడే : ఉద్యోగ క్రీడాకారులు ఉత్తమ ప్రతిభతో సింగరేణి కీర్తిని దేశవ్యాప్తంగా విస్తరింపజేయాలని గోలేటి సింగరేణి డిస్పెన్సరీ సీనియర్ మెడికల్ అధికారి డా.ఎం. మురళీమోహన్ అన్నారు. బెల్లంపల్లి ఏరియా వర్క్‌పీపుల్స్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం గోలేటి శ్రీభీమన్న మైదానంలో ఫుట్‌బాల్ పోటీలు నిర్వహించారు. ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ. . ఉద్యోగ రీత్యా విధుల్లో బిజీగా గడిపే కార్మిక క్రీడాకారులు కాసేపు క్రీడలకు సమయం కేటాయిస్తే శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాస కలుగుతుందని వివరించారు. బెల్లంపల్లి ఏరియా క్రీడాకారులు మంచి క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించి కోలిండియా స్థాయిలో పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. సీనియర్ పర్సనల్ అధికారి డి.ప్రశాంత్, డబ్ల్యూఎస్ కో-ఆర్డినేటర్ కిరణ్‌బాబు, జనరల్ కెప్టెన్ జీపీ చంద్రకుమార్ క్రీడాకారులు పాల్గొన్నారు.


ఫుట్‌బాల్ పోటీలు ప్రారంభిస్తున్న గోలేటి సింగరేణి డిస్పెన్సరీ సీనియర్ మెడికల్ అధికారి మురళీమోహన్

హింసకు గురైతే.. పోలీసులకు ఫిర్యాదు చేయాలి

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే : జిల్లాలో మహిళలు, పిల్లలు ఎవరి నుంచైనా హింసకు గురైతే నిర్భయంగా పోలీసులకు ఫిర్యాదు చేయాలని ఎస్పీ డి.వి.శ్రీనివాస్‌రావు అన్నారు. వారి సంక్షేమానికి అన్ని విధాలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. షీ, భరోసా బృందాల ద్వారా జిల్లాలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. జిల్లా వ్యాప్తంగా 38 హాట్‌స్పాట్‌లలో 10 అవగాహన సదస్సులు నిర్వహించినట్లు గుర్తుచేశారు. నాలుగు కేసుల్లో కౌన్సెలింగ్ ఇచ్చారన్నారు. మహిళలు, యువతులు, పిల్లలు ర్యాగింగ్, ఈవ్ టీజింగ్, హింసకు గురైతే వెంటనే షీ టీం సభ్యులను లేదా పోలీసులను సంప్రదించవచ్చని పేర్కొన్నారు. వీరి రక్షణ కోసం యాంటీ ఉమెన్ ట్రాఫికింగ్ టీం, భరోసా కేంద్రాలు పని చేస్తున్నాయన్నారు. సామాజిక మాధ్యమాల వినియోగ సమయంలో చాలా జాగ్రత్తగా ఉండాలన్నారు. ఫొటోలు, వీడియోలు పోస్టు చేసే సమయంలో వ్యక్తిగత భద్రతకు భంగం కలుగకుండా చూసుకోవాలన్నారు. సమస్యలు ఎదురైతే ఆసిఫాబాద్ డివిజన్ వారు షీ టీం చరవాణి నం.87126 70564లో, కాగజ్‌నగర్ డివిజన్ వారు చరవాణి నం.87126 70565 లో లేదా డయల్ 100 కు సమాచారం అందించాలని సూచించారు. అనంతరం జిల్లాకు కేటాయించిన ఇద్దరు ప్రొబెషనరి సబ్ ఇన్‌స్పెక్టర్లు అనిల్, సర్తాజ్ పాషాలు ఎస్పీని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు.



ఎస్పీ శ్రీనివాస్‌రావుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న ప్రొబెషనరీ ఎస్సైలు

బదిలీ ఉపాధ్యాయులను విడుదల చేయాలి

ఆసిఫాబాద్ అర్బన్: బదిలీ అయి విడుదల కాకుండా ఉన్న ఉపాధ్యాయులను డీఎస్సీ నియామకాలకు ముందే విడుదల చేయాలని పీఆర్టీయూ టీఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఏటుకూరి శ్రీనివాస్, చునార్కర్ అనిల్ డీఈఓ ఎస్.యాదయ్యను కోరారు. డీఈఓను మంగళవారం సత్కరించారు. అనంతరం విద్యాపరమైన సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. కుమ్మరి రవి, ఎం.హనుమంతు, దొంతి రాజు, వేణుగోపాలరావు, వెంకటేశ్వర్లు, అబ్దుల్ లతీఫ్, డి.సత్యనారాయణ, సీహెచ్.శ్రీనివాస్, సదాశివ్, పర్స చంద్రశేఖర్, ఉదయ్‌బాబు, ప్రభాకర్, మహేశ్వరరావు, మురళి, అంజయ్య తదితరులున్నారు.

కార్మికులకు అన్యాయం జరగకుండా చూడాలి

కాగజ్‌నగర్: ఎస్పీఎం, లారీ అసోసియేషన్ మధ్య నెలకొన్న సమస్యను ప్రభుత్వ అధికారులు చొరవ తీసుకుని పరిష్కరించాలని మిల్లు కార్మికులు కోరారు. మంగళవారం మిల్లు గేటు ఆవరణలో విలేకరులతో మాట్లాడుతూ అయిదు రోజులుగా లోడింగ్ ఆగిపోయిందని, 34 లారీలు రోడ్డుపైనే నిలిచిపోయాయన్నారు. దీంతో 70 లోడింగ్ కార్మికులకు ఉపాధి లేకుండా పోయిందని వాపోయారు. మిల్లులో ఉత్పత్తి సైతం తగ్గిందని, దీని ప్రభావం కార్మికులపై పడకుండా ఉండేందుకు అధికారులు స్పందించాలని కోరారు.

భీం వర్ధంతి తరలిరండి

కెరమెరి, న్యూస్‌టుడే : జోడేఘాట్‌లో ఈ నెల 17న నిర్వహించనున్న గోండ్ వీరుడు కుమురం భీం వర్ధంతిని విజయవంతం చేయాలని ఉత్సవ కమిటీ ఛైర్మన్ పెందుర్ రాజేశ్వర్ పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలోని ఆదివాసీ భవనంలో ఆదివాసీ నాయకులతో సమావేశం నిర్వహించారు. రాజకీయాలకు అతీతంగా అన్ని రాజకీయ పార్టీలు, ఆదివాసీ సంఘాల నాయకులు, పటేళ్లు ముందుకు రావాలన్నారు. కమిటీ కన్వీనర్ పెందుర్ మోతీరాం, నాయకులు కనక ప్రభాకర్, కోవ విజయ్, కోవ ఇందిరా, మడావి రఘునాథ్, జ్ఞానేశ్వర్, చందన్‌షా, భీంరావు తదితరులున్నారు.

కొనసాగుతున్న శిక్షణ

బెజ్జూరు, న్యూస్‌టుడే : శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని మంచిర్యాల సర్కిల్ మిషన్ భగీరథ ఎస్ఈ రవీందర్ మంచినీటి సహాయకులకు సూచించారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో మిషన్ భగీరథ మంచినీటి సహాయకులకు మోటార్ల వినియోగంపై శిక్షణ ఇచ్చారు. విద్యుత్తు మోటార్ల వినియోగంపై వివరించారు. గ్రామాల్లో ప్రజలకు భగీరథ నీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. ఈఈ వెంకటపతి, ఏఈ అభిలాష్, శిక్షకులు సునీల్ తదితరులున్నారు.

కంటి వైద్యశిబిరాలకు స్పందన

కాగజ్‌నగర్, న్యూస్‌టుడే : పట్టణంలోని కిమ్స్ మల్టీస్పెషాలిటీ ఆసుపత్రిలో కొత్తపల్లి వెంకటలక్ష్మిచంద్రయ్య మెమోరియల్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరానికి స్పందన లభించింది. ఆప్తాల్మజిస్టు వసీ 35 మందికి పరీక్షలు జరిపి 12 మందికి శస్త్రచికిత్సలు అవసరమని గుర్తించారు. వీరికి లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉచితంగా పరీక్షలు చేయిస్తామని, ప్రతి మంగళవారం నిర్వహించనున్న ఉచిత వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షులు డా.కొత్తపల్లి శ్రీనివాస్ తెలిపారు.

ప్రజాబంధు ఫౌండేషన్ ఆధ్వర్యంలో..

పట్టణంలోని ప్రజాలైఫ్‌కేర్ ఆసుపత్రిలో ప్రజాబంధు ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరానికి స్పందన లభించింది. 40 మందికి పరీక్షలు నిర్వహించగా 30 మందికి శస్త్రచికిత్సలు అవసరమని గుర్తించారు. విడతల వారిగా ఉచితంగా శస్త్రచికిత్సలు చేయిస్తామని, ఉచిత కంటి వైద్యశిబిరాన్ని అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు డా. పాల్వాయి హరీష్‌బాబు తెలిపారు.

పర్యటించి.. సమ్మేళనంలో పాల్గొని

బల్లార్ష, న్యూస్‌టుడే : మహారాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ మంగళవారం చంద్రపూర్ జిల్లాలో పర్యటించారు. ఈ సందర్భంగా పట్టణంలోని వన అకాడమిలో వివిధ ప్రభుత్వశాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. జిల్లాలో 17శాతం మంది ఆదివాసీలు ఉన్నారని వారికి ఒక్కటే ప్రభుత్వ ఏకలవ్య ఆశ్రమ పాఠశాల ఉందని మరో పాఠశాల స్థాపించి వారికి గుణాత్మక విద్య అందించాలని సూచించారు. అనంతరం తాలూకా కేంద్రమైన పోంబుర్ణలో ఆదివాసీ సమ్మేళనంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆదివాసీల వివిధ రకాల వస్తు ప్రదర్శనను తిలకించారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సుధీర్ మునగంటీవార్, తదితరులున్నారు.


వెదురుతో తయారుచేసిన వస్తువులు పరిశీలిస్తున్న గవర్నర్ సీపీ రాధాకృష్ణన్

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక

దహెగాం, న్యూస్‌టుడే: మండలంలోని చిన్న రాస్పెల్లి ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. అండర్-17 బాలికల విభాగంలో ఇటీవల మంచిర్యాల జిల్లాలో జరిగిన జోనల్ పోటీలలో నికాడి రజిత, చాప్లె శ్రావణి, ఎల్కరి రాజేశ్వర్‌లు పాల్గొని విజేతగా నిలిచారని ప్రధానోపాధ్యాయురాలు సునిత తెలిపారు. మెదక్ జిల్లాలోని ఇందిరాగాంధీ స్టేడియంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొననున్నట్లు పేర్కొన్నారు.


విద్యార్థులతో ఉపాధ్యాయులు

జాతీయ స్థాయికి ఎదగాలి

ఆసిఫాబాద్ అర్బన్: జిల్లా స్థాయి సైన్సు డ్రామా పోటీల్లో విజేతలుగా నిలిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన జన్కాపూర్ జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు డీఈఓ ఎస్.యాదయ్య మంగళవారం జిల్లా కేంద్రంలో ప్రత్యేకంగా అభినందించి ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ ప్రతిభ కనబరిచి జాతీయ పోటీల్లో పాల్గొనాలని ఆకాంక్షించారు. జిల్లా సైన్సు అధికారి కటుకం మధుకర్, ప్రధానోపాధ్యాయులు ఎం.ఉదయ్ బాబు, ఉపాధ్యాయులు డి.వెంకటేశ్వర్లు, వి.రాజేశ్, జె.సంతోష్ పాల్గొన్నారు.

అలరించిన స్వాగతోత్సవం

కాగజ్‌నగర్, న్యూస్‌టుడే : పట్టణంలోని వసుంధర జూనియర్, డిగ్రీ కళాశాల విద్యార్థుల ఫ్రెషర్స్ డే వేడుకలు అలరించాయి. విద్యార్థులు ఉత్సాహంగా నృత్య ప్రదర్శన, ఫ్యాషన్‌షో నిర్వహించారు. పాత, కొత్త విద్యార్థుల మధ్య స్నేహం మరింత బలపడేలా ఇటువంటి వేడుకలు ఉపయోగపడతాయని కళాశాలల కరస్పాండెంట్ కుడిక్యాల రాజమౌళి తెలిపారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్, ప్రిన్సిపల్స్‌ను అధ్యాపకులు, విద్యార్థులు శాలువాతో సత్కరించారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ఆర్ఆర్ నిరత్కర్, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ వి.ప్రేమలత తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినుల నృత్యాలు

బస్సు నుంచి స్వల్పంగా పొగలు

పెంచికల్‌పేట్, న్యూస్‌టుడే: పల్లె వెలుగు బస్సు నుంచి స్వల్పంగా పొగలు వచ్చాయి. ఈ ఘటన మండలంలోని చేడ్వాయి సమీపంలో చోటు చేసుకుంది. ప్రయాణికుల వివరాల ప్రకారం.. మంగళవారం కాగజ్‌నగర్ నుంచి బెజ్జూర్‌కు పల్లె వెలుగు బస్సు బయలుదేరింది. చేడ్వాయి సమీపంలోకి రాగానే గేరులో సమస్య రావడంతో డ్రైవర్ గమనించి బస్సును నిలిపివేశాడు. ప్రయాణికులు వేరే వాహనాల్లో గమ్యస్థానం చేరుకున్నారు. ఈ విషయమై చోదకుడు గోపాల్‌ను వివరణ కోరగా.. బేరింగ్‌లో సమస్య రావడంతో వాహనాన్ని ఆపానని చెప్పారు.

ఎస్జీటీల సమస్యల పరిష్కారానికి కృషి

ఆసిఫాబాద్ అర్బన్, న్యూస్‌టుడే : సెకండరీ గ్రేడు టీచర్స్ సమస్యల పరిష్కారం కోసం పనిచేసే ఏకైక సంఘం ఎస్జీటీయూ మాత్రమేనని ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు మహిపాల్ రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని దీక్ష భూమిలో మంగళవారం నిర్వహించిన ఎస్జీటీ ఉపాధ్యాయుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఇటీవల విడుదలైన జీవో 25 ప్రాథమిక విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టించేలా ఉందని ఆరోపించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కును కల్పించేలా చర్యలు చేపట్టాలని లేకుంటే జరగబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బరిలో ఎస్జీటీ తరపున నిలబడతామని హెచ్చరించారు. సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశం, జిల్లా అధ్యక్షుడు తాళ్లపల్లి శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా నూతన అధ్యక్షుడిగా ఎల్.శంకర్

సెకండరీ గ్రేడు టీచర్స్ యూనియన్ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకొన్నట్లు ఎన్నికల అధికారి సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశం ప్రకటించారు. జిల్లా అధ్యక్షుడిగా లకావత్ శంకర్, ప్రధాన కార్యదర్శిగా చునార్కర్ చైతన్యకుమార్, గౌరవాధ్యక్షుడిగా తాళ్లపల్లి శ్రావణ్, గౌరవ సలహాదారుగా మర్సుకోల తిరుపతి, అసోసియేట్ అధ్యక్షుడిగా దుర్వ నిరంజన్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా నాయికిని శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా భుక్యా శంకర్, నాటరావ్, రాథోడ్ మహేందర్‌లు ఎన్నికైనట్లు ప్రకటించారు.

లడ్డూ ప్రసాదం కల్తీపై నిరసన

మందమర్రి పట్టణం, న్యూస్‌టుడే: తిరుపతి లడ్డూ ప్రసాదం కల్తీ చేయడంపై మంగళవారం రామకృష్ణాపూర్‌లో హిందూ చైతన్య వేదిక ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. పూజారుల మంత్రోచ్చరణ మధ్య స్వామివారి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. అంబాప్రసాద్, రామకృష్ణ, రాజేంద్ర, రమేష్, హరిప్రసాద్, అశోక్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

డీఎస్సీలో మెరిశారు

కెరమెరి, న్యూస్‌టుడే : ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన డీఎస్సీ ఫలితాల్లో ఏజెన్సీ మండలంలోని నిరుద్యోగులు ప్రతిభ కనబర్చారు. కష్టపడి చదివి తల్లిదండ్రుల కలలను నిజం చేశారు.

అక్కా తమ్ముడికి..

అనార్‌పల్లి(బోకడగూడ)కు చెందిన రాథోడ్ వెంకట్‌రాం-మేనాబాయి దంపతులిద్దరూ నిరక్ష్యరాస్యులే. ఇద్దరు పిల్లలను ఉన్నతస్థాయిలో చూడాలనుకున్నారు. ఈమేరకు కష్టపడి చదివించారు. కుమార్తె సువర్ణకు ఎస్జీటీ(సెకండరీ గ్రేడ్ టీచర్)లో 66.30 మార్కులతో ఎస్టీ విభాగంతో 15వ ర్యాంకు, కుమారుడు మహేష్‌కు ఎస్జీటీలో 69.73 మార్కులతో ఎస్టీ విభాగంలో ఆరో ర్యాంకు సాధించి.. కన్నవారి కలలను నిజం చేశారు.


రాథోడ్ మహేష్


రాథోడ్ సువర్ణ,

ఉర్దూ మాధ్యమంలో...



సోహల్‌ఖాన్

ధనోరకు చెందిన సోహల్‌ఖాన్ ఉర్దు మాధ్యమంలో సాంఘిక శాస్త్రంలో 56.70 మార్కులతో జిల్లా మొదటి ర్యాంకు సాధించారు. తండ్రి హబీబ్‌ఖాన్ ఆటో నడపుతూ కుమారుడిని చదివించారు. తన కష్టానికి తగిన ఫలితం వచ్చిందని సంతోషం వ్యక్తం వ్యక్తం చేశారు.

పట్టుదలతో మొదటి ర్యాంకు



రాథోడ్ నరేష్

మండల కేంద్రానికి చెందిన రాథోడ్ తిరుపతి-దేవులి దంపతుల కుమారుడు నరేష్.. తెలుగు(ఎల్‌పీ)లో ఎస్టీ విభాగంలో మార్కులు 71.87లతో జిల్లా మొదటి ర్యాంకు సాధించారు. చిన్నప్పటి నుంచి ప్రభుత్వ కొలువు సాధించాలనే లక్ష్యంతో పట్టుదలతో చదివారు.

పీఈటీ విభాగంలో..

మాచర్ల బాలాజీ

మండల కేంద్రంలోని నెహ్రూనగర్‌కు చెందిన మాచర్ల లక్ష్మిబాయి-నాగయ్య దంపతుల కుమారుడు బాలాజీ 62.5 మార్కులతో పీఈటీ (వ్యాయామ ఉపాధ్యాయుడు) విభాగంలో జిల్లాలో మొదటి ర్యాంకు సాధించారు. తల్లిదండ్రులు బండలు(వడ్డెర) కొడుతూ, కూలీ పనులు చేసుకుంటూ చదివించారు. ప్రభుత్వ ఉద్యోగం సాధించడంపై వారు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు ఎంపిక

కౌటాల, న్యూస్‌టుడే : కాగజ్‌నగర్ పట్టణంలో ఎస్‌జీఎఫ్(స్కూల్ గేమ్స్ ఫెడరేషన్) ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి అండర్-17 ఎంపిక పోటీల్లో కౌటాల మండలం మయూరి విద్యాలయంకు చెందిన పదోతరగతి విద్యార్థులు తరుణ్, హర్షిత్‌లు ప్రతిభ కనబర్చారు. మంగళవారం ఇద్దరు విద్యార్థులను కరస్పాండెంట్ శాగంటి యాదగిరి, ఉపాధ్యాయులు సన్మానించారు.

బ్యాంకు సేవలపై అవగాహన

కాగజ్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే: బ్యాంకులు రుణసహాయం అందించడమే కాకుండా అమలు చేస్తున్న సంక్షేమ ఫలాలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ గ్రామీణ బ్యాంకు సర్‌సిల్క్ శాఖ చీఫ్ మేనేజర్ కె.వినోద్‌కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని బోడేపల్లిలో ఆర్థిక, డిజిటల్ సేవలపై అవగాహన సదస్సు నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జీవిత బీమా పథకాల్లో సభ్యత్వం కలిగి ఉండాలని సూచించారు. రైతులు రుణాల మంజూరుకు దళారులను ఆశ్రయించకుండా నేరుగా బ్యాంకు అధికారులనే ఆశ్రయించాలని పేర్కొన్నారు. బ్యాంకు క్షేత్రాధికారి ఉదయ్‌కుమార్, మాజీ సర్పంచి రాజన్న, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్, కళాబృందం సభ్యులు, రైతులు పాల్గొన్నారు.


ఆర్థిక, డిజిటల్ అక్షరాస్యతపై వివరిస్తున్న కళాబృందం



పూల పండగ.. సంస్కృతి నిండుగా..

● నేటి నుంచి బతుకమ్మ సంబరాలు

న్యూస్‌టుడే, తలమడుగు :

సంస్కృతి సంప్రదాయాలకు పెట్టింది పేరు బతుకమ్మ పండగ. రోజుకో ప్రత్యేకతతో.. తీరొక్క పూలతో.. ఆకట్టుకునే ఆటపాటలతో మహిళలంతా కలిసి కట్టుగా నిర్వహించుకుంటారు. పుట్టింటి నుంచి మెట్టినింటికి ఆడ బిడ్డలు చేరుకుని గౌరమ్మను కొలుస్తారు. శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా తొమ్మిది రోజుల పాటు సాగే ఈ పండగ ఎంగిలి పూలతో ప్రారంభమై సద్దుల బతుకమ్మతో ముగుస్తుంది. ఇది మహాలయ అమావాస్య రోజు(బుధవారం) ప్రారంభమవుతుంది. 'శ్రీలక్ష్మి నీ మహిమలూ గౌరమ్మ చిత్రమై తోచునమ్మా గౌరమ్మ.. భారతీ సతివయ్యి బ్రహ్మకిల్లాలివై' అంటూ మహిళలు ఆటపాటలతో అలరిస్తారు. బతుకమ్మను ఆదిశక్తి స్వరూపిణిగా మహిళా లోకం వేడుకుంటోంది. ఆధ్యాత్మికతను చాటి చెబుతోంది.

ఆదిలాబాద్‌లో మాత్రం విభిన్నం

ప్రస్తుత ఆదిలాబాద్ జిల్లాలో గతం నుంచి భిన్న సంస్కృతి ఉంది. ఇది మహారాష్ట్ర సరిహద్దులో ఉండటంతో ఇతర జిల్లాలకు భిన్నంగా పండగను నిర్వహిస్తారు. నిర్మల్, మంచిర్యాల జిల్లాలో ప్రధాన కూడళ్లలో చిన్న గుంత తవ్వి దాని చుట్టూ గద్దెలు కట్టి వాటిపై బొడ్డెమ్మలను పేర్చి తొమ్మిది రోజుల పాటు పాటలు పాడుతూ ఆడుకుంటారు. అనంతరం దసరా కంటే ముందుగా లేదా దసరా మరుసటి రోజున ఊరి మహిళలందరూ కలిసి రకరకాల పూలతో బొడ్డెమ్మలను పేర్చి వేడుకలకు ముగింపు పలుకుతారు. ఆదిలాబాద్ జిల్లాలో మాత్రం దసరా పండగ ముగిసిన పక్షం రోజుల్లో వీలునుబట్టి చివరి రోజును నిర్ణయిస్తారు. గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలంతా అధిక సంఖ్యలో హాజరై ఆనందోత్సాహాల నడుమ వేడుకలను ముగిస్తారు.

పుట్టింటి నుంచి మెట్టినింటికి..

జిల్లాలో బతుకమ్మ సంబరాలు మొదలయ్యాయంటే చాలు పెళ్లి చేసుకున్న మహిళలంతా తమ పిల్లాపాపలతో కలిసి పుట్టినింటికి చేరుకుంటారు. కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా గడుపుతారు. అయితే జిల్లాలో ఏ పండగ వచ్చినా మెట్టినింటికే ప్రాధాన్యమిస్తారు. కాగా నెలరోజుల పాటు పండగ జరుగుతుండటంతో పుట్టింటికి చేరుకొని అక్కడే కొద్దిరోజులు ఉండి తనివితీరా తమ చిన్ననాటి స్నేహితురాళ్లతో ఆడిపాడతారు.

బావి తవ్వి పువ్వులు పేర్చి

గ్రామాల్లోని ప్రధాన కూడళ్లలో విశాల ఆవరణ కలిగిన ఇంటి ఎదుట ఓ పెద్ద గుంత తవ్వుతారు. అందులో నుంచి తీసిన మట్టితో చుట్టూ గద్దెలను పేర్చుతారు. అందులో గంగా గౌరీల పేరిట ఎదురెదురుగా రెండు పెద్ద గద్దెలను, మిగిలినవి అవసరం మేరకు గద్దెలను తయారు చేసుకుంటారు. సంబరాల తొలి రోజున బాజాభజంత్రీల నడుమ యెంపల్ల చెట్టును గ్రామ శివారు ప్రాంతంలోని ఓ పొలం నుంచి తీసుకొచ్చిన గుంతలో నాటుతారు. నిత్యం ఉదయం, సాయంత్రం వేళల్లో గద్దెలపై చిన్నపాటి బతుకమ్మలను పేర్చడం, రాత్రి సమయంలో అందరూ ఆటపాటల్లో పాల్గొంటారు. దసరా పండగ రోజు మాత్రం చిన్న సద్దుల బతుకమ్మగా భావిస్తారు. ఆ రోజు బతుకమ్మలను అందంగా తయారు చేసి గద్దెలపై పేర్చి నైవేద్యాలను సమర్పిస్తారు. ఇంటిల్లిపాది ఆనందంగా అక్కడే పాల్గొంటారు. ప్రతి బతుకమ్మ వద్ద రోజుకో ప్రత్యేకత ఉంటుంది. గ్రామ పెద్దల నిర్ణయం మేరకు తమకు వీలైన మంచి రోజు చూసుకుని పెద్ద సద్దుల పండగ పేరిట ముగిస్తారు. ఆ రోజు మాత్రం రాత్రి పూట పెద్ద ఎత్తున బతుకమ్మలను పేర్చి డప్పువాయిద్యాల నడుమ పాటలు పాడుతూ గ్రామంలో శోభాయాత్ర నిర్వహిస్తారు. తర్వాత నిమజ్జనం చేస్తారు.



మృత్యు ఘడియ

● వాహనం అదుపుతప్పి ఒకే కుటుంబంలో అయిదుగురి దుర్మరణం

ఈటీవీ - ఆదిలాబాద్ : న్యూస్‌టుడే - ఆదిలాబాద్ నేర విభాగం

కన్ను తెరిస్తే జననం. కన్నుమూస్తే మరణం. రెప్పపాటు సమయంలో ఏం జరుగుతుందో తెలియనిదే జీవితం. అలాంటి ఘటనే సోమవారం అర్ధరాత్రి గుడిహత్నూర్ మండలం మేకలగండి వద్ద 44వ జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. ఒకే కుటుంబానికి చెందిన అయిదుగురిని మృత్యువు కబళించింది. మరో 15 నిమిషాల్లో ఇంటికి చేరుకుంటామనగా.. జాతీయ రహదారిపై ప్రమాదం చోటుచేసుకొని జీవితాలు తలకిందులయ్యాయి.


ప్రమాదంలో ధ్వంసమైన కారు


మొహ్మద్ ఉస్మాన్‌ఉద్దీన్


సయ్యద్ మహ్మద్ అలీ


ఫరీద్‌ఉద్దీన్


మొహినొద్దీన్


సయ్యద్ మొహిజొద్దీన్

ఆదిలాబాద్ పట్టణం టీచర్స్‌కాలనీకి చెందిన సయిదా ఆఫ్రిన్(36) - మహ్మద్ మొహినొద్దీన్(43) దంపతుల కొడుకు మహ్మద్ ఫరీద్ ఉద్దీన్(14) భైంసాలోని మహదుల్ అబ్రార్ మదర్సాలో ధార్మిక విద్యను అభ్యసిస్తున్నాడు. అర్ధ సంవత్సర పరీక్షలు ముగియడంతో మదర్సా సోమవారం నుంచి సెలవులు ప్రకటించింది. మహ్మద్ ఫరీద్ ఉద్దీన్‌ను ఇంటికి తీసుకెళ్లటానికి తల్లీ సయిదా ఆఫ్రిన్ భర్త మహ్మద్ మొహినొద్దీన్ కూతురు ఇస్రాఫాతిమా(4), మరో ఇద్దరు కొడుకులు సాజ్ ఉద్దీన్(13), ఉస్మాన్‌ఉద్దీన్(8)తోపాటు తండ్రి సయ్యద్ మొహిజొద్దీన్(67), అన్న కొడుకు సయ్యద్ మహ్మద్ అలీ(5)తో కలిసి సోమవారం సాయంత్రం ఆదిలాబాద్ నుంచి ఇసుజీ-డిమాన్ వాహనంలో భైంసాకు వెళ్లారు. అక్కడ ఫరీద్‌ఉద్దీన్‌ను తీసుకొని ఆదిలాబాద్‌కు తిరుగుముఖం పట్టారు. అర్ధరాత్రి 11 గంటలు దాటిన తర్వాత ఆదిలాబాద్‌కు 15 కి.మీ. దూరంలో ఉన్న మేకల గండి దగ్గర వాహనం రహదారి పక్కన ఉండే రక్షణ పిల్లర్లను ఢీకొట్టుకుంటూ వెళ్లి పక్కనే ఉన్న సిమెంటు నాలాలో పడిపోవటంతో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది.

మృతులు వీరే..

క్షణకాలంలో జరిగిన ఘటనలో చిన్నారులు మహ్మద్ ఉస్మాన్‌ఉద్దీన్, సయ్యద్ మహ్మద్ అలీ అక్కడికక్కడే చనిపోయారు. క్షతగాత్రులను అంబులెన్స్‌లో రిమ్స్ ఆసుపత్రికి తీసుకెళ్తుండగా పెద్దాయన సయ్యద్ మొహిజొద్దీన్, మొహినొద్దీన్ చనిపోయారు. మదర్సా నుంచి ఇంటికి వస్తున్న మహ్మద్ ఫరీద్ ఉద్దీన్ మంగళవారం తెల్లవారుజామున మృతి చెందాడు. క్షణాల్లో జరిగిన ఈ ఘటన సయ్యద్ మొహినొద్దీన్ కుటుంబంలో తీరని దుఃఖాన్ని మిగల్చగా.. జిల్లాలో దిగ్భ్రాంతిని కలిగించింది.

భర్త పిల్లలేరి?

తీవ్రంగా గాయపడిన సయిదా ఆఫ్రిన్ పరిస్థితి దయనీయంగా మారింది. భర్త మహ్మద్ మొహినొద్దీన్, తండ్రి సయ్యద్ మొహిజొద్దీన్, కొడుకులు మహ్మద్ ఫరీద్ ఉద్దీన్, మహ్మద్ ఉస్మాన్‌ఉద్దీన్, అన్న కొడుకు మహ్మద్ అలీ చనిపోయారని తెలిసి ఆమె దుఃఖంతో తల్లడిల్లింది. ఊహించని ప్రమాదం నుంచి ప్రాణాలతో బయటపడి బేల చూపులు చూస్తున్న కూతురు ఇస్రా ఫాతిమా, కొడుకు సాజ్ ఉద్దీన్‌ల దయనీయస్థితి అందరిని కంటతడి పెట్టించింది. భారీగా తరలివచ్చిన బంధువుల అశ్రునయనాల మధ్య మంగళవారం సాయంత్రం ఆదిలాబాద్‌లోని ఈద్గా ఖబ్రస్థాన్‌లో అంత్యక్రియలు ముగిశాయి.

కాల్‌టెక్స్ కష్టాలు



బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధి కాల్‌టెక్స్ ప్రాంతం పరిస్థితి ఘోరంగా ఉంది. మంచిర్యాలకు వెళ్లే ప్రధాన రోడ్డుకు ఇరువైపులా ఉన్న మురుగు కాలువలను నెలల తరబడిగా శుభ్రం చేయకపోవటంతో దుర్గంధం వ్యాపించి వ్యాధులకు కారణమవుతోంది. దుకాణాల వ్యర్థాలు, చెత్తా చెదారాన్ని మురుగు కాలువల్లో వేస్తున్నప్పటికీ బల్దియా యంత్రాంగం పట్టించుకోవడం లేదు.

సమీక్షలే ముఖ్యం.. సమస్యలపై నిర్లక్ష్యం

ఈటీవీ-ఆదిలాబాద్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాధులతో అల్లాడుతోంది. ఊరు, వాడా తేడా లేకుండా జ్వరాలు, కీళ్ల, ఒళ్లు నొప్పులతో జనం కాలం వెళ్లదీయాల్సి వస్తోంది. వైద్యారోగ్య, బల్దియా, పంచాయతీ, డీఆర్‌డీఏ శాఖల సమన్వయ లోపంతో వ్యాధులు విజృంభిస్తున్నాయి. పచ్చదనం, పరిసరాల పరిశుభ్రత కనిపించడం లేదు. ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీల విధి నిర్వహణపై దృష్టిసారిస్తున్న ఉన్నతాధికారులు జిల్లా అధికారుల పనితీరును పరిగణనలోకి తీసుకోకపోవటంతో ప్రజలకు ప్రాణసంకటంగా మారుతోంది.

ఈ ఏడాది ఫిబ్రవరి 2న జడ్పీ, మండల, పంచాయతీల పాలన ముగియటంతో ప్రత్యేక అధికారుల పాలన అందుబాటులోకి వచ్చింది. పర్సన్ ఇన్‌ఛార్జిలుగా నియమితులైన అధికారులు ఇచ్చే నివేదికలపై సమీక్షలు చేయడమే తప్పితే క్షేత్రస్థాయిలోని సమస్యలను ఉన్నతాధికారులు దృష్టి సారించటం లేదు. పల్లె, పట్టణాల్లో ఫాగింగ్, బ్లీచింగ్, దోమల నివారణ మందుల పిచికారీ చేయడం లేదు. శుభ్రం చేయని మురుగు కాలువలు రోగాలు ప్రబలడానికి కారణమవుతున్నాయి. తాగునీటి వసతుల క్లోరినేషన్ జరగడం లేదు. వాటికి కేటాయిస్తున్న నిధుల లెక్క తేలడం లేదు.

☛ బేల మండలం గణేష్‌పూర్‌లోని పల్లె క్రీడా ప్రాంగణం దస్త్రాల్లో చూపించుకోవడానికి తప్పితే అక్కడ దేనికీ ఉపయోగపడటం లేదు. పిచ్చిగడ్డి పెరిగి విష పురుగులకు ఆవాసంగా మారింది.

జిల్లాల వారీగా వివరాలు..

జిల్లా	మండలాలు	పంచాయతీలు	మున్సిపాలిటీలు
ఆదిలాబాద్	17	473	01
నిర్మల్	18	400	03
ఆసిఫాబాద్	15	335	01
మంచిర్యాల	16	311	07



ప్రబలుతున్న రోగాలు : జ్వరంతో బాధపడుతున్న వీరు తిర్యాణి మండలం చింతపల్లికి చెందిన అత్తా కోడళ్లు చేదం పోశక్క, లక్ష్మి. నెలరోజులుగా కీళ్ల, ఒళ్ల నొప్పులతో బాధపడుతున్నారు. తిర్యాణి, మంచిర్యాలలో చూపించుకున్నా నొప్పులు తగ్గటం లేదు. తిర్యాణి సహా పెరకపల్లి, తెలండీ, రాళ్లకన్నెపల్లి, గంభీరావుపేట, చెల్మెల, నాయకపుగూడలో ఇదే దయనీయ పరిస్థితి ఉంది.

నిర్మల్ బొమ్మకు జాతీయ ఖ్యాతి

● పర్యాటక దినోత్సవం సందర్భంగా వరించిన అవార్డు

నిర్మల్, న్యూస్‌టుడే: కళకు మహత్తరమైన శక్తి ఉంటుంది. అచేతనంగా భావించే అనేక వస్తువులపై కళాకారుల చూపు పడగానే చేతనత్వంగా మారుతున్నాయి. వారి కర స్పర్శతో అవి పులకితమై అపూర్వ కళాఖండాలుగా రూపుదిద్దుకుంటున్నాయి. అటు తేలికపాటిగా ఉండే పొనికి కర్రతో బొమ్మలు తయారుచేస్తూ ఇటు ప్రకృతి రంగులతో చిత్రాలు గీస్తూ నిర్మల్‌కు జాతీయ, అంతర్జాతీయ గుర్తింపు తీసుకొస్తున్నారు.. ఇక్కడి కళాకారులు. 400 ఏళ్ల నుంచి బొమ్మలు తయారు చేస్తూ జీవనం కొనసాగిస్తూ ఆ 'కళ'ను బతికిస్తున్నారు. సజీవంగా కళ్లకు కట్టినట్లు కనిపించే ఈ బొమ్మలతో నిర్మల్‌కు ఎన్నోసార్లు గుర్తింపు వచ్చిన విషయం తెలిసిందే. పర్యాటక దినోత్సవం సందర్భంగా కేంద్ర పర్యాటకశాఖ ఆధ్వర్యంలో గత నెల 27న దిల్లీలో జరిగిన కార్యక్రమంలో హస్తకళ విభాగంలో కొయ్య బొమ్మలకు నిలయమైన నిర్మల్‌ను 'ఉత్తమ పర్యాటక గ్రామం' అవార్డు వరించింది. ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌కడ్, కేంద్ర పర్యాటక శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ చేతుల మీదుగా జిల్లా అదనపు పాలనాధికారి (స్థానిక సంస్థలు) ఫైజాన్ అహ్మద్, కొయ్య బొమ్మల పారిశ్రామిక సంఘం అధ్యక్షుడు పెంటయ్య ఈ అవార్డును అందుకున్నారు.


ఇచ్చిన అవార్డు


కళాకారులు చేతిలో రూపుదిద్దుకున్న బొమ్మలు

40 కుటుంబాలు..

నాలుగు శతాబ్దాల క్రితం నిర్మల్‌ను పాలించిన నిమ్మనాయుడు తన వెంట కళాకారులను తీసుకొచ్చి ఇక్కడ స్థిరనివాసం కల్పించారు. అప్పటి నుంచి దాదాపు 40 కుటుంబాలు (నగిశి) కళను నమ్ముకొని జీవిస్తున్నాయి. అయిదారు తరాల నుంచి ఇక్కడి కళాకారులు బొమ్మలు తయారుచేస్తున్నారు. బొమ్మల తయారీ వెనుక మహిళల హస్తకళ దాగి ఉంది. ఇళ్లల్లో మహిళా కళాకారుల చేతిలో ఆకులో ఆకై, బొమ్మలో బొమ్మై, కొమ్మలో కొమ్మై, పువ్వులో పువ్వై జీవకళ సంతరించుకుంటుంది. ప్రపంచ ప్రఖ్యాతి పొందిన ఈ బొమ్మల తయారీలో మహిళా కళాకారులు తమ నైపుణ్యాన్ని చూపుతున్నారు. వివిధ జంతువులు, పక్షులు, పిచ్చుకలు, నెమళ్లు, పోపుల పెట్టె, పులులు, సింహాలు, నోరూరించే పండ్ల నమూనాలు, ఇలా ఇంకెన్నో బొమ్మలు కళ్లకు కట్టినట్లు కనిపిస్తాయి. సహజత్వం, సమ్మోహనం ఇక్కడి కళాకారుల ప్రత్యేకత.

డిమాండ్ బాగుంది..

నిర్మల్ కొయ్యబొమ్మలు రాష్ట్రంతో పాటు దేశంలో పలు రాష్ట్రాలు, విదేశాలకు ఎగుమతి అవుతున్నాయి. ఇక్కడి నుంచి హైదరాబాద్ లేపాక్షికి పంపిస్తున్నారు. అక్కడి నుంచి ఈ బొమ్మను ఎగుమతి చేస్తారు. ప్రస్తుతం కర్రతో ఆకట్టుకునేలా బొమ్మలే ఉపయోగపడేలా తయారు చేస్తుండటంతో మంచి డిమాండ్ పెరిగింది. రోజుకు రూ.10 వేల నుంచి రూ.15 వేల విలువ గల బొమ్మలు విక్రయిస్తున్నారు. అమెరికా, ఇంగ్లాండ్ దేశాలతో పాటు ఇతర దేశాలకు పంపిస్తున్నారు.

డీసెట్ ధ్రువపత్రాల పరిశీలన



పాలనాప్రాంగణం, న్యూస్‌టుడే : డీఎడ్ ప్రవేశాల కోసం డీసెట్ రాసిన అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన ఆదిలాబాద్‌లోని డైట్ కళాశాలలో మంగళవారం సజావుగా జరిగింది. ఉమ్మడి జిల్లాలోని ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల, కుమురం భీం జిల్లాల నుంచి 36 మంది అభ్యర్థులు తరలి వచ్చారు. తమ ధ్రువపత్రాలను సమర్పించారు. ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ డా.కోల కిరణ్, సూపరింటెండెంట్ భోజన్న తదితరులు ఈ ప్రక్రియను పర్యవేక్షించారు. వెబ్ ఆప్షన్లు ఆన్‌లైన్‌లో పెట్టుకుని సీటు అలాట్‌మెంటు తర్వాత కేటాయించిన కళాశాలలో రిపోర్టు చేయాలని సూచించారు.

దసరా ఉత్సవాలకు బాసర ముస్తాబు


భక్తుల కోసం ఏర్పాటుచేస్తున్న క్యూలైన్లు

ముధోల్ (బాసర), న్యూస్‌టుడే: దసరా ఉత్సవాలకు బాసర అమ్మవారి ఆలయం ముస్తాబు అవుతోంది. గురువారం నుంచి తొమ్మిది రోజుల పాటు నవరాత్రి ఉత్సవాలు జరగనున్నాయి. హాజరయ్యే భక్తులకు ఇబ్బందులు లేకుండా ఆలయాధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. తెలుగు రాష్ట్రాలతోపాటు మహారాష్ట్ర నుంచి భక్తులు భారీగా తరలిరానున్నారు. గతంలో జరిగిన పొరపాట్లు పునరావృతం కాకుండా ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయాధికారులు చెప్పారు. దసరా సందర్భంగా ఆలయంలో అభిషేకాలు ఉండవు. కేవలం పూజలు మాత్రమే నిర్వహిస్తారు. అభిషేకం, కుంకుమ పూజలతో పాటు ప్రత్యేక పూజలు చేస్తారు. తొమ్మిది రోజుల్లో రోజుకో రూపంలో అమ్మవారు భక్తులకు దర్శనమిస్తారు. ఈ తొమ్మిది రోజుల పాటు భక్తులకు అన్నదానం చేస్తారు. చిన్నారులకు అక్షరాభ్యాసాలు చేయిస్తారు.

రంజీ ట్రోఫీ పోటీలకు హిమతేజ ఎంపిక



ఆదిలాబాద్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే : జిల్లా కేంద్రానికి చెందిన కె.హిమతేజ బీసీసీఐ ఆధ్వర్యంలో నిర్వహించే రంజీ ట్రోఫీ పోటీలకు ఎంపికయ్యారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి తొలి క్రీడాకారుడిగా చరిత్రను సృష్టించారు. తన ఎనిమిదేళ్ల కలను సాకారం చేసుకున్నారు. ఈ నెల 11, 18వ తేదీల్లో డెహ్రాడూన్‌లో నిర్వహించే రంజీ ట్రోఫీ పోటీల్లో ఆయన హైదరాబాద్ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారు. అండర్-19, 23 ఏళ్ల విభాగంలో ఆయన సీకె.నాయుడు, బుచ్చిబాబు స్మారక పోటీల్లో పరుగుల వర్షం కురిపించారు. హైదరాబాద్ జట్టుకు సారథిగానూ రాణించారు.

కవ్వాల్ సఫారీకి వేళాయే

● మూడు నెలల అనంతరం నేడు ప్రారంభం

జన్నారం, న్యూస్‌టుడే: కవ్వాల్ అందాలు ఎప్పుడెప్పుడు తిలకిద్దామా అని ఎదురుచూస్తున్న పర్యాటకులకు ఆ రోజు రానే వచ్చింది. దట్టమైన అడవి మధ్యలో చెంగున ఎగిరే జింకలు, పురివిప్పి నర్తించే మయూరాలు, కాజ్‌వేల నుంచి జాలువారే జలపాతంలాంటి నీటి వయ్యారాలను చూసి మురిసిపోవడానికి మరికొన్ని గంటల సమయం మాత్రమే ఉంది. జులై, ఆగస్టు, సెప్టెంబరు మూడు నెలలపాటు సఫారీ వాహనాల రాకపోకలను నిషేధించిన అటవీశాఖ బుధవారం నుంచి వాటిని పునఃప్రారంభించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. వర్షాలు అధికంగా కురవడం, అడవిలో నివసించే అన్ని రకాల జంతువుల కలయికకు అనువైన సమయంగా భావించి ప్రతీ ఏడాది మూడు నెలలపాటు అడవిలోకి వెళ్లడానికి ఎలాంటి అనుమతులు ఉండవు.



బైసన్‌కుంట వద్ద సఫారీ వాహనం ఎక్కుతున్న పర్యాటకులు

ఎంత చెల్లించాలంటే..

జంగిల్ సఫారీలో రెండు గంటలపాటు అన్నీ మరిచిపోయి అడవిలో తిరిగి రావడానికి శని, ఆదివారం ఒక్కో వాహనానికి రూ.4 వేలు తీసుకుంటారు. మిగిలిన రోజుల్లో రూ.3,500 వసూలు చేస్తారు. ఒక్కో వాహనంలో ఆరుగురు ప్రయాణించాలనే నిబంధన ఉంది. ఒకవేళ అదనంగా ఒకరు లేదా ఇద్దరు వెళ్లాలంటే మాత్రం ఒక్కొక్క వ్యక్తికి రూ.500 చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. అటవీశాఖ ఆధ్వర్యంలో నాలుగు కొత్తవి, ఒక పాత వాహనం నడుస్తున్నాయి. ఉదయం 6.30 గంటలకు అడవిలోకి వెళ్లే వాహనం 8.30 వరకు తిరుగు పయనం అవుతోంది. ఉదయం 9.30 గంటల నుంచి 11.30 గంటల వరకు తిరిగి మధ్యాహ్నం 3.30 గంటలకు వెళ్లే వాహనం సాయంత్రం 5.30 గంటల వరకు అడవిలో ప్రయాణం పూర్తి చేసుకుంటుంది. ప్రతి రోజు మూడు ట్రిప్పులు వెళ్లే వాహనాలకు మంగళవారం మాత్రం సెలవు.

ఎక్కడెక్కడ తిప్పుతారంటే..

సఫారీ వాహనాన్ని ఆన్‌లైన్‌లోగానీ నేరుగాగాని బుక్ చేసుకోవచ్చు. వాహనంలో ఎక్కిన పర్యాటకులను వెల్ కం కవ్వాల్ టైగర్ జోన్ బోర్డు వద్ద నుంచి గోండుగూడ బేస్‌క్యాంపు, నీలుగాయికుంట, బైసన్‌కుంట వరకు తీసుకెళ్తారు. ఆయా కుంటల వద్ద ఫొటోలు దిగడానికి, కొద్దిసేపు సేద తీరడానికి అవకాశం కల్పిస్తారు. తిరిగి కడెం ప్రధాన కాలువగుండా మైసిపెల్లి బీట్ నుంచి హనుమాన్ మందిరం వరకు వెళ్లి ప్రధాన రహదారి చేరుకుంటారు. ప్రయాణంలో ఎన్నెన్నో మూగజీవాలు తారసపడుతుంటాయి. ఇక్కడ చుక్కల దుప్పుల సంఖ్య ఎక్కువగా ఉండటంతో అడుగడుగునా అవి కనిపించి కనువిందు చేస్తాయి. వన్యప్రాణులు, పక్షులను చూసే అవకాశాలు ఉన్నాయి. పర్యాటకశాఖ ఆధ్వర్యంలో రెండు పాత సఫారీ వాహనాలు ఉన్నాయి. శని, ఆదివారాల్లో రూ.2 వేలు, మిగిలిన రోజుల్లో రూ.1,500 వసూలు చేస్తారు. అడవి అందాలను చూపించేందుకు జంగిల్ సఫారీ వాహనాలు సిద్ధంగా ఉన్నాయి. మరి అడవిలో పయనించేందుకు మీరు సిద్ధమేనా...!


నీలుగాయి కుంట వద్ద సందడి చేస్తున్న పర్యాటకులు


సొనాలలో బ్రహ్మోత్సవాల్లో మంగళహారతులతో మహిళలు

సొనాలలో సీతారాముల బ్రహ్మోత్సవాలు

● రేపటి నుంచి వేడుకలు ప్రారంభం

న్యూస్‌టుడే, సొనాల(బోథ్) : బోథ్ మండలం సొనాలలో దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా తొమ్మిది రోజుల పాటు ఘనంగా సీతారాముల బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తారు. ప్రతి రోజూ సాయంత్రం రామాలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక వాహనంలో గ్రామస్థులు రాముడు, సీత, లక్ష్మణుడి విగ్రహాలను ఘనంగా ఊరేగిస్తారు. ఊరంతా ఏకమై ప్రతి రోజు మహిళలు మంగళహారతులతో రథానికి స్వాగతం పలుకుతారు. గ్రామంలో 2016లో రామాలయ కమిటీ ఛైర్మన్‌గా వ్యవహరించిన తుల నారాయణ ఆధ్వర్యంలో ప్రారంభించారు. గురువారం నుంచి వేడుకలు ప్రారంభం కానున్నాయి.


విగ్రహాలను ఊరేగిస్తున్న గ్రామస్థులు

తొమ్మిది రోజులు కనులపండువగా..

తొమ్మిది రోజుల పాటు తొమ్మిది వాహనాలపై విగ్రహాలను ఊరేగించనున్నారు. సూర్యప్రభ, చంద్రప్రభ, కల్పవృక్షం, గరుడ, హనుమంత, గజ, పెద్ద శేష వాహనం, చిన్న శేష వాహనం, హంస వాహనాలపై విగ్రహాలను ఊరేగిస్తారు. వివిధ ప్రాంతాల్లో స్థిరపడ్డవారంతా గ్రామానికి తరలివస్తారు. గ్రామంలోని యువత, మహిళలు, ఉద్యోగులు, వృద్ధులు అందరిని బ్రహ్మోత్సవాల్లో భాగం చేస్తారు. 2015లో గ్రామానికి చెందిన పలువురు ఉద్యోగులు దసరా సెలవుల్లో శ్రీవారి సేవకు వెళ్లగా అక్కడ బ్రహ్మోత్సవాలను చూశారు. ఖానాపూర్, లక్ష్మణ్‌చాంద, మెట్‌పల్లి లాంటి ప్రాంతాల్లో దసరాకు బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తుండటం చూసి గ్రామంలోనూ ప్రారంభించారు.

గ్రామస్థుల సహకారంతో కార్యక్రమాలు

- జి.వి.రమణ, రామాలయ కమిటీ అధ్యక్షుడు, సొనాల

సొనాలలో ఎనిమిదేళ్లుగా గ్రామస్థుల సహకారంతో బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తున్నాం. కమిటీ ఆధ్వర్యంలో పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలను చేపడుతున్నాం. గ్రామంలో తొమ్మిది రోజుల పాటు పండగ వాతావరణం నెలకొంటుంది.